క్లుప్తంగా

రెండు రోజులు శలపాడు రైల్వే గేటు మూసివేత

చేబ్రోలు: రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం చేబ్రోలు మండలం శలపాడు గ్రామం వైపు వెళ్లే రైల్వే గేటును రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. 3,4వ తేదీలలో రైల్వే లైన్ అత్యవసర మరమ్మతుల కారణంగా సంగం జాగర్లమూడి, శలపాడు లెవల్ క్రాసింగ్ గేట్ నెంబరు 235ను మూసివేయటం జరుగుతుందని రాకపోకలు సాగించేవారు ప్రత్యామ్నాయ మార్గాలు ద్వారా గమ్యస్థానాలకు వెళ్లాలని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్జీరంగా వర్సిటీలో గాంధీ జయంతి వేడుకలు



గుంటూరు రూరల్: యుగ పురుషులు యుగానికి ఒక్కరు పుడతారని అటువంటివారిలో మన జాతిపిత మహాత్మాగాంధీ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు తెలిపారు. సోమవారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోగల విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం జాతిపిత చేసిన ఉద్యమాలు వివరించారు. కార్యక్రమంలో డీఎస్ఏ డాక్టర్ పీ సాంబశివరావు, జాయింట్ రిజిస్ట్రార్ ఎం శ్రీనివాసరావు, బోధన బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతిరాత నైపుణ్యంపై ఉపాధ్యాయులకు శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: చేతిరాతను అందంగా తీర్చిదిద్దుకునే నైపుణ్యంపై ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు నేతృత్వంలోని క్యాలీగ్రఫీ శిక్షకులు సోమవారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 35 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. బొల్లంకొండ ఎంఈవో బి. రాజకుమారి సైతం పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. బోసుబాబు, క్యాలీగ్రఫీ ఫ్యామిలీ మెంబర్లు నాగమణి, షాజీర్, నాగలక్ష్మి, బురాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

బాపట్లటౌన్: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని సూర్యలంక రోడ్డులో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే గుంజి శ్రీనాథ్ (21) చెడు వ్యసనాలకు బానిసై మద్యం మత్తులో సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ షేక్ రఫీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేస్ ఫౌండేషన్ అధినేతకు సన్మానం

భట్టిప్రోలు: పల్నాడు జిల్లా వినుకొండ తారక రామ క ల్యాణ మండపంలో సోమ వారం బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, లిటిల్ చాంప్స్ అకాడ మి ఆఫ్ ఇండియా రాష్ట్రస్థాయి భరత నాట్య సమ్మేళనం, సమాజ సేవకుల ఎక్స్లెన్సీ అవార్డుల ప్రదానం జరిగింది. 72 మందికి వివిధ విభాగాలలో నిష్ణాతులైన వారికి అవార్డులు అందజేశారు. గ్రేస్ ఫౌండేషన్ ద్వారా పల్లెకోన నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధినేత కైతేపల్లి షాలేమ్‌రాజు, ఏపీ ఇన్‌చార్జ్ య న్నం సురేష్ అవార్డులను అందుకున్నారు. లిటిల్ చాంప్స్ అకాడమి చైర్మన్ బుచ్చేశ్వరరావు, వినుకొండ మున్సిపల్ చైర్మన్ దస్తగిరి షకీలా, మున్సిపల్ కమిషనర్ డి. వెంకయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు, సీఐ ఎస్. సాంబశివరావు, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సీహెచ్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

సూరేపల్లి(భట్టిప్రోలు): తక్కువ పెట్టుబడితో అధిక లబ్ధి పొందేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని సూరేపల్లి యూనిట్ ఇన్‌చార్జి డి. ఝాన్సీరాణి అన్నారు. సూరేపల్లి పరిధిలోని వేమవరంలో సోమవారం పంటలను ఆశించే పచ్చ, లద్దె పురుగులను సామూహికంగా నశింపజేసేందుకు అగ్ని అస్త్రం తయారు చేసుకునే విధానాన్ని రైతులకు స్వయంగా తయారు చేసి, చూపారు. అలాగే దశపర్ణి కూడా తయారు చేశారు. ఝాన్సీరాణి మాట్లాడుతూ పచ్చి మిరపకాయలు, వెల్లుల్లి, వేపాకు, జిల్లేడు ఆకులు, ఆవు మూత్రం కలిపి తయారు చేసిన అగ్ని అస్త్రం పంటలలో రసం పీల్చే పురుగులను గుడ్డు దశలో నివారించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పురుగు మందుల వాడకాన్ని నిలుపుదల చేసి, కషాయాలు వాడటం వల్ల ఖర్చు తగ్గడమే కాక ఆరోగ్యకరమైన ఆహారం అందరికీ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన ఘనంగా గాంధీ జయంతి

- గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు, సేవా కార్యక్రమాలు
- వృద్ధాశ్రమాల్లో అన్నదానాలు



పొన్నూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు



తహసీల్దార్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతిలో పాల్గొన్న తహసీల్దార్‌శ్రీకాంత్, ఉద్యోగులు

ప్రత్తిపాడు: గాంధీ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల సమక్షంలో కార్యదర్శులు గ్రామ సభలు నిర్వహించారు. స్వచ్ఛందంగా యువకులు వృద్ధులు, యాచకులకు కొందరు పండ్లు, దుప్పట్లు పంచిపెట్టగా, మరికొందరు వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

- నడింపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి కార్యదర్శి ఖాజా పారిశుద్య కార్మికులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ సభను నిర్వహించి, గ్రామ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.
- ప్రత్తిపాడు బస్టాండు సెంటరులో పోతురాజు లక్ష్మీనారాయణ వృద్ధులు, వికలాంగులు, యాచకులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.
- మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్తిపాడులో స్థానిక కార్యాలయంలోని బాపూజీ విగ్రహానికి ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, ఖాజా పీరాలు వాలంటీర్లు సచివాలయ ఉద్యోగుల సమక్షంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, ఉపాధి పనులను వివరించారు.
- వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామ పంచాయతీలో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ పాల్గొన్నారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంపద తయారీ కేంద్రం నుండి తయారు చేసిన వర్మీకంపోస్టు ఎరువును రైతులకు పంపిణీ చేశారు.



నడింపాలెం సచివాలయం వద్ద గాంధీజీకి నివాళులర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రాజగోపాల్

- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం పక్కనున్న మహాత్మాగాంధీ విగ్రహానికి సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టా వెంకటేశ్వర్లు, మద్ది పూర్ణచంద్రరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాల్లో అన్నదానం..

మండల పరిధిలోని కోయవారిపాలెం, బొర్రావారిపాలెం గ్రామాల్లోని వృద్ధాశ్రమాల్లో సోమవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ మాజీ చైర్మన్ గుంటుపల్లి వీరభుజంగరాయలు ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం బాపూజీ భారతావనికి చేసిన సేవలను వృద్ధులకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ యెనిరెడ్డి రాఘవరెడ్డి, మాజీ మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ దయారత్నం, ఎంపీటీసీ మన్నవ మహేంద్ర, షేక్ కరిముల్లా, పమిడి వెంకట్రావు, యడ్ల బాలాజీ, వణుకూరి మల్లారెడ్డి, కారసాల జాకబ్ తదితరులు పాల్గొన్నారు.



తెలగపాలెంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

ఘనంగా జాతిపిత మహాత్మాగాంధీ జయంతి

పొన్నూరు: గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారని పొన్నూరు వైఎస్సార్ సీపీ నాయకులు, మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పొన్నూరు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ భవనం పద్మలీల, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు మొహమ్మద్, ఆదిశేషులు, జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు పాల్గొని మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో..

పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేదార్‌నాథ్ శ్రీకాంత్ పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో...

లయన్స్‌క్లబ్ ఆఫ్ పొన్నూరు నిడుబ్రోలు ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలగపాలెంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కసుకర్రులోని అమ్మ సేవా నిలయం వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వల్లంశెట్టి శ్రీధర్, కోశాధికారి జాలాది యానాదిరావు, కరిములాల కొల్లేరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

కాకుమాను: భారతదేశ ముద్దుబిడ్డ మహాత్మాగాంధీ అని అలాంటి మహాత్ముడు చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పరుల బాధను తన బాధగా భావించిన వాడే నిజమైన మనిషని బాపు బోధించేవాడని ఆయన తెలిపారు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యం రావాలంటే ప్రతి ఒక్కరు ఆయన చేసిన బోధనలు, బాటలోనే నడవాలని ఆయన సూచించారు. శాంతి, సహనం ఉన్న వాడే నిజమైన మనిషని మహాత్ముడు బోధించారని అలాంటి మహోన్నత వ్యక్తి మార్గాన్నే ప్రతి ఒక్కరు ఎంచుకుని ఆ మార్గంలో పయనించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు,సిబ్బంది

గాంధీజీ ఆశయసాధనకు కృషి చేయాలి

పెదనందిపాడు: మనకు అహింస ద్వారా స్వాతంత్ర్యం తీసుకువచ్చిన జాతిపిత మహాత్మాగాంధీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎంపీడీవో రాజగోపాల్ అన్నారు. సోమవారం ఉదయం జాతిపిత జయంతి వేడుకల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ భారతదేశ కీర్తిని ప్రపంచ నలుమూలల చాటిన వ్యక్తి మన జాతిపిత అని తెలిపారు. ఈవోపీఆర్డీ సాయిలీల, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశింబీ, కమ్మ సాంబశివరావు, సర్పంచ్ దాసరి పద్మారావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశీంపీరా, ఉపసర్పంచ్ దివ్వి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో..

పెదకాకాని: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు పెదకాకాని శివాలయంలో నిర్వహించారు. గాంధీజీ చిత్రపటం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్, వేద పండితులు రవి, గణేష్, కృష్ణ పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో దుప్పట్లు పంపిణీ



ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు



శివాలయంలో గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఏసీ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ శంకరరావు

పెదకాకాని: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న స్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాధ్యమైందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ గుల్జార్, పెండ్యాల మాధవి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, గోళ్ల జోసఫ్, షేక్ నజీర్, కొంకి రామారావు పాల్గొన్నారు.



బొర్రావారిపాలెం వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న నాయకులు



కుర్నూతలలో మహిళా రైతులకు వర్మీకంపోస్టు అందజేస్తున్న సర్పంచ్ గోపాలకృష్ణ

29 మంది రక్తదానం



రక్తదాన శిబిరంలో దాతలకు పండ్లు అందజేస్తున్న జిల్లా గవర్నర్ శంకరరెడ్డి

పెదనందిపాడు: పెదనందిపాడు రోటరీక్లబ్ మరియు ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 29 మంది రక్తదానం చేశారు. సోమవారం జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన శిబిరాన్ని రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో రోటరీక్లబ్ ముందుంటుదని, రోటరీ క్లబ్ సేవలు అందరికి ఉపయోగం అని, ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనలో ముఖ్య పాత్ర పోషించిందని అక్షరాస్యతే ధ్యేయంగా రోటరీక్లబ్ పనిచేస్తున్నదని, పెదనందిపాడు రోటరీక్లబ్ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని క్లబ్ సేవలను ఆయన కొనియాడారు. ముందుగా గాంధీ బొమ్మ సెంటర్‌లో, కల్యాణ మండపం ఆవరణలో ఉన్న జాతిపిత గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ వై.వేణుగోపాల్, పెదనందిపాడు రోటరీక్లబ్ అధ్యక్షుడు వై.కోదండరామిరెడ్డి, కార్యదర్శి వై రమణయ్య, కోశాధికారి ఎన్వీఎస్ నాగేశ్వరరావు, క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, పారిశ్రామికవేత్తలు అరవపల్లి కృష్ణ, దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, క్లబ్ సభ్యులు గుడూరి వీరయ్య చౌదరి, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్‌రింగ్ రోడ్డు గేటు వద్ద కొనసాగుతున్న మరమ్మతులు

అక్టోబరు 5వ వరకూ గేటు మూత



పెదకాకాని: ఇన్నర్‌రింగ్ రోడ్డుపై రాకపోకలు కొనసాగించే మార్గంలో గడ్డిపాడు సమీపంలో ఉన్న రైల్వేగేటు వద్ద ట్రాక్, రోడ్డు మరమ్మతులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మించినప్పటి నుంచి విజయవాడ వైపు నుండి వచ్చే వాహనాలు గుంటూరు నగరంలోకి వెళ్లకుండానే గోరంట్ల వద్ద అమరావతి రోడ్డుపైకి చేరుతున్నాయి. అలానే నగరంలోకి వెళ్లే వాహనదారులకు సౌలభ్యంగా మారడంతో రాకపోకలు బాగా పెరిగాయి. రైల్వే గేటు వద్ద , గేటుకు రెండు వైపులా రోడ్డు దెబ్బతిని వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. గేటు వద్ద మరమ్మతులు చేసేందుకు ఈనెల ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు గేటు మూత వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వారి పనులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పోలీసులు ఆ రోడ్డుకు వాహనాలు వెళ్ళకుండా బారికేడ్లు అడ్డుగా ఏర్పాటు చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చర్యలు

రేపు పెరవలిలో విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభం

పెరవలి(వేమూరు): వినియోగదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం విద్యుత్ రంగంలో పలు మార్పులు తీసుకొని రావడం జరిగిందని విద్యుత్ శాఖ డీఈ వీవీ చిరంజీవి అన్నారు. పెరవలి గ్రామంలో రూ.4.5 కోట్లతో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. బుధవారం సాయంత్రం 3 గంటలకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభిస్తారని సోమవారం వెల్లడించారు. పెరవలిలో తోటకూర కోటేశ్వరరావు, దుర్గాంబ దంపతుల జ్ఞాపకార్థకం కుమారుడు అంబ్రిష్ 40 సెంట్లు స్థలం ఇవ్వడంతో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల పెరవలిపాలెం, పెరవలి, చావలి, కోడిపర్రు, పెనుమర్రు గ్రామాలకు మెరుగైన విద్యుత్ అందించడం జరుగుతుందని చెప్పారు. జంపనిలో కూడా మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం రూ.2.5 కోట్లతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చంపాడు, పోతుమర్రు గ్రామాలకు నూతన విద్యుత్ లైన్లను రూ.25 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వరహాపురం, బూతుమల్లి, బేతేలు పురం గ్రామా లకు రూ.30 లక్షలతో, కుచ్చెళ్లపాడు, వెల్లబాడు, గ్రామాలకు రూ.20 లక్షలతో, అబ్బునగూడవల్లి, రూ.15 లక్షలతో లైను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో అగ్రికల్చర్, గృహ విద్యుత్‌కు ఒక్క ఫీడరుపై విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని, ఇక్కడ వేర్వేరు ఫీడర్లు ఏర్పాటు చేయ నున్నట్లు చెప్పారు.



పెరవలిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్

గ్రామసభల నిర్వహణ ఇలానేనా?!

- గైర్హాజరైన వలంటీర్లుకు జీతం నిలిపివేత
- సచివాలయ ఉద్యోగులపై చర్యలకు సిఫారసు

ప్రత్తిపాడు: పంచాయతీ అధికారులు గ్రామ సభల నిర్వహణను ఆషామాషీగా తీసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా నిర్వహిస్తూ సభల ఉద్దేశ్యాలకు తిలోదకాలిస్తున్నారు. అందుకు దర్పణమే ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రం. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక గ్రామ సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించారు. అయితే గ్రామసభకు గ్రామ సర్పంచ్ సహా పలువురు గైర్హాజరయ్యారు. గ్రామస్తులు పట్టుమని పది మంది కూడా సభకు హాజరవ్వలేదు. ప్రజల సంగతి అటుంచితే వలంటీర్లు కూడా సభకు రాలేదు. ఇదిలా ఉంటే సచివాలయ ఉద్యోగులు సైతం కొందరు డుమ్మా కొట్టేశారు. ఇక పాలకవర్గంలోని సభ్యులు సైతం గైర్హాజరయ్యారు. వాస్తవానికి గ్రామసభ నిర్వహించాలంటే పదిశాతం జనం సభకు హాజరుకావలసి ఉంది. అప్పుడే సభను నిర్వహించాలి. కానీ అవేమీ పట్టకుండా సభను నిర్వహించి చేతులు దులిపేసుకున్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా

గైర్హాజరైన వారికి జీతం నిలిపివేత..

గ్రామ సభకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా తెలిపారు. సభకు హాజరుకాని గ్రామ వలంటీర్లుకు సోమవారం జీతాలను నిలిపి వేయడంతో పాటు పదేపదే సమావేశాలకు గైర్హాజరవుతున్న వారిని శాశ్వతంగా తొలగిస్తున్నట్లు తెలిపారు. డుమ్మా కొట్టిన గ్రామ సచివాలయ ఉద్యోగులపై చర్యలకు సంబంధిత శాఖల అధికారులకు సిఫారసు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే వలంటీర్ల వలన నేను తలదించుకోవాల్సి వస్తుందంటూ గ్రామసభ సాక్షిగా సెక్రటరీ వాపోయారు. గ్రామ సభకు హాజరుకాకుంటే సస్పెండ్ కూడా చెయ్యడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

విజ్ఞాన్‌లో ఘనంగా గాంధీ జయంతి



మాట్లాడుతున్న చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: మహాత్ముని మార్గం సర్వదా ఆచరణీయమని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ప్రధాని భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గం వలనే నేడు మనం స్వేచ్ఛా వాయువులను పీల్చుకోగలుగుతున్నామన్నారు. పూజ్య బాపూజీ కలలు కన్న ఆశయాలను నెరవేర్చవలసిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ విద్యార్థులతో పాటు హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేసారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా గాంధీ జయంతి రోజు మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పలు స్టేషన్ల పరిధిలో అరెస్టు చేశారు. నల్లచెరువు ప్రాంతానికి చెందిన చింతలపూడి సుబ్బారెడ్డి కమ్మ శేషయ్య గ్రౌండ్స్ వద్ద మద్యం విక్రయిస్తున్న సమయంలో లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకుని 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మద్యం విక్రయిస్తున్న బండి శ్రీనును అదుపులోకి తీసుకుని 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మానసిక స్థిరత్వానికి కరాటే దోహదం

బాపట్ల అర్బన్: ప్రాచీన భారత యుద్ధ కళ కరాటే మానసిక స్థిరత్వానికి బాటలు వేస్తుందని కరాటే మాస్టర్ ఎం.భావన్నారాయణ అన్నారు. స్థానిక కొత్రా వారి వీధి కృష్ణ మందిరం ఆవరణంలో కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం అభినందన సభ జరిగింది. ఈ నెల 1న విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ విజేతలను అభినందించారు. 8 -11 సంవత్సరాల విభాగంలో సీహెచ్ మిథిల్, జి. లోహిత బంగారు పతకాలు సాధించినట్లు వెల్లడించారు. పి. భరత్, సీహెచ్ ఈక్షిత వెండి పతకాలను, పూర్విక, ఐ.మేఘన, సుశాంత్, పవన్ కాంస్య పతకాలతో మెప్పించారని చెప్పారు. 11 -13 సంవత్సరాల కేటగిరీలో కె. కార్తీక్, ప్రజ్ఞాన్ బంగారు పతకాలు, పి. నిశాంత్ కాంస్య పతకం, హర్షిత తృతీయ బహుమతిని సాధించినట్లు చెప్పారు. అభినందన సభలో జె.విజయకుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కరాటే మాస్టర్ భావన్నారాయణ

ఆర్‌వీఆర్‌జేసీలో స్వచ్ఛతా హీ సేవా

గుంటూరు రూరల్: గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి అనే జాతిపిత గాంధీ నినాదాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కళాశాలల ఎన్‌సీసీ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జాతిపిత గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీ కలలుగన్న స్వరాజ్య నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. పరిసరాల పరిశుభ్రత ఆరోగ్య రక్ష అని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా రోడ్లను ఊడ్చి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషాక్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛతాహిసేవ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, ఎన్‌సీసీ విద్యార్థులు